సిఐటియు జిల్లా మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:అల్లూరి జిల్లా కేంద్రంలో ఈ నెల 20, 21 తేదీల్లో జరగనున్న సిఐటియు జిల్లా మహాసభను కార్మికులు విజయవంతం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి కొర్ర శంకర్రావు కోరారు. సిఐటియు జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు, ఆశ, వెలుగు వివోఏలు, వీఆర్ఏలు, 108,104, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికులను సమగ్ర చట్టం చేయాలన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు నేత శంకరరావు

కార్పొరేట్ మాఫియాకు హైడ్రో పవర్ ప్రాజెక్టు అప్పగింతపై ఉద్యమం

▶▶ ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడం రాజ్యాంగ విరుద్ధం ▶▶ సుప్రీంకోర్టు తీర్పును ధిక్కరించిన రాష్ట్ర ప్రభుత్వం ▶▶ ఎపి గిరిజన సంఘం

ప్రజాశక్తి-పాడేరు: ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టును ప్రధాని మోడీ ఆదేశాలతోనే కార్పొరేట్ మాఫియా సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిందని, దీనిని వ్యతిరేకించాలని గిరిజన ఉద్యోగ మేధావులకు గిరిజన సంఘం పిలుపు నిచ్చింది. దీనిపై మంగళవారం పాడేరు జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో లో గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి. అప్పలనర్స మాట్లాడుతూ, విశాఖలో పర్యటించిన ప్రధాని మోడీ ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టును తన మిత్రులైన అదానీ, శ్రీ సాయి ఎలక్ట్రికల్ లిమిటెడ్‌కు అప్పగించాలనే ఒత్తిడి కారణంగా వైసిపి ప్రభుత్వం తన రాజకీయ లబ్ధి కోసం కోసం మంగళవారం జరిగిన క్యాబినెట్లో ఆమోదించిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం 1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజ నేతరులకు అటవీ భూమి కేటాయించిందన్నారు. 5వ షెడ్యూల్డ్ నిబంధనలకు వ్యతిరేకంగా హైడ్రో పవర్ ప్రాజెక్టు కార్పొరేట్ సంస్థలకు అప్పగించడాన్ని గిరిజన సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. గతంలో అనంతగిరి కొండల్లో టాటా బిర్లా కంపెనీకి బాక్సైట్ తవ్వకాలకు లీక్ ఇవ్వడాన్ని సుప్రీంకోర్టు రద్దు చేసిందని గుర్తు చేశారు. జర్రెల బ్లాక్లో బాక్సైట్ తవ్వకాలపై రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ కూడా గిరిజన సహజ సంపదను, అటవీ వనరులను అప్పగించడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొందని తెలిపారు. గిరిజన గ్రామ సభ నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా కార్పొరేట్ సంస్థలకు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అప్పగించడం సరైంది కాదన్నారు. పీసా చట్టం అటవీ హక్కుల చట్టం, 1/70 చట్టం గిరిజన ప్రాంతాల్లో అమలులో ఉన్నా లెక్క చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభిప్రాయానికి భిన్నంగా వ్యవహరించడం తగదని, రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఖండించాలని గిరిజన ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలకు రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు.గిరిజన గ్రామ సభ అభిప్రాయం లేకుండా దొంగ చాటున రాష్ట్ర ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా గ్రామంలో సర్వే నిర్వహించిందని, గత

మాట్లాడుతున్న అప్పలనర్స

ఏడాది డిసెంబర్ 23న అటవీ, పర్యావరణ అనుమతులను మోడీ ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ పనులు చేస్తే 32గ్రామాల ప్రజలు నిర్వాసితులు అవుతారన్నారు. అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేసి హక్కు పత్రాలు ఇవ్వడానికి సవాలక్ష ఆంక్షలు విధించే ప్రభుత్వం సమారు 1000 ఎకరాల అటవీ భూమిని ప్రైవేట్ సంస్థలకు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. కేంద్ర అటవీ సంరక్షణ చట్టాన్ని సవరణకు పూనుకున్న కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతిచ్చి అటవీ సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకు కుట్ర చేస్తుందని విమర్శించారు.ఇందుకే పార్లమెంట్లో బిజెపికి వైసిపి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణమైన మద్దతు ఇస్తుందని. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు.ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక గిరిజనులకు 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పిస్తున్న జీవో నెంబర్ 3ను రద్దు చేయించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరుద్ధరణకు క్యాబినెట్లో చర్చ పెట్టలేదన్నారు. బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితా చేర్పించుటకు శతవిధులా ప్రయత్నిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి గిరిజన ప్రాంతంలో ఉద్యమం ద్వారా ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. విద్యా సంస్థలలో విద్యార్థి, గిరిజన ప్రజా సంఘాల ప్రవేశం నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం ప్రజాస్వామ్యం అని విమర్శించారు. గిరిజన సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి నవరత్నాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. దీంతో గిరిజన ప్రాంత అభివృద్ధి కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పి.లక్కు, జిల్లా ఉపాధ్యక్షుడు కె.నరసయ్య, మండల కార్యదర్శి ఎస్.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు కంపెనీలకు అప్పగించడం రాజ్యాంగ రాజ్యాంగ విరుద్ధం : సురేంద్ర

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణాలను ప్రభుత్వం విరమించుకోవాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం అరకువేలి గిరిజన సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సురేంద్ర మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో 1/70 చట్టానికి విరుద్ధంగా,గిరిజనేతరులకు అటవీ భూమి కేటాయిస్తే సహించేది లేదని పేర్కొన్నారు.5వ షెడ్యూల్డ్ ఏరియాలో నిబంధనలకు వ్యతిరేకంగా హైడ్రో పవర్ ప్రాజెక్టు కార్పొరేట్ సంస్థలకు అప్పగించాడని గిరిజన సంఘంగా తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. గిరిజన చట్టాలను తుంగలో తొక్కడం అన్యాయమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలన, లేనియెడల భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటానికి నాంది పలుకుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న, గిరిజన సంఘం మండల నాయకులు జి.చిన్నబాబు, తదితులున్నారు.

మాట్లాడుతున్న నాగరాణి, చిత్రంలో ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే తదితరులు

పాలిటెక్నిక్‌తో మెరుగైన ఉపాధి

- ఆ దిశగా విద్యార్థులకు అవగాహన కల్పించాలి

- రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి ఛైర్మన్ నాగరాణి

ప్రజాశక్తి - రంపచోడవరం

పాలిటెక్నిక్ చేయడం ద్వారా మెరుగైన ఉపాధి లభిస్తుందని, అందువల్ల విద్యార్థులు 10వ తరగతి పాస్ అయిన వెంటనే పాలిటెక్నిక్‌లో జాయిన్ అయ్యే విధంగా వారికి అవగాహన కల్పించాలని రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి ఛైర్మన్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో అన్ని మండలాల ఎంఇఒలు, అసిస్టెంట్ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, హెచ్ఎంలు, సిఆర్‌టిలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ ప్రతి ఐటీడీఏ పరిధిలో 2014 సంవత్సరంలో పాలిటెక్నిక్ కాలేజీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దేశం అభివృద్ధి చెందాలంటే సాంకేతిక విద్యను అభ్యసించాలన్నారు. ఏజెన్సీలోని ప్రతి పాఠశాలలో 8, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు లెక్కలు, ఫిజిక్స్ సబ్జెక్టులపై దృష్టి సారించి విద్యా బోధన చేయాలని సూచించారు. పాలిటెక్నిక్ పాసైన విద్యార్థులకు ప్రైవేట్ కంపెనీలలో ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కొన్ని ప్రైవేటు సంస్థల్లో పాలిటెక్నిక్ పాస్ అయిన విద్యార్థులకు అప్రెంటిస్ చేసే సమయంలో నెలకు రూ.12 వేలు నుండి రూ.15వేలు స్టయిఫండ్ కూడా ఇస్తున్నట్లు, కొన్ని కంపెనీలలో రూ.50వేలు నుండి రూ.60వేలు వరకు జీతం పొందుతున్నట్లు తెలిపారు. రంపచోడవరంలో పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే మాట్లాడుతూ ఏజెన్సీలోని చదువుకున్న యువతీ, యువకులకు ప్రైవేట్ సంస్థల్లో ఉపాధి కల్పించే విధంగా మూడుసార్లు జాబ్ మేళాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాలిటెక్నిక్‌లో జాయిన్ అయ్యేందుకు విద్యార్థులకు ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ విద్య డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సిహెచ్.శ్రీనివాసరావు, పాలిటెక్నిక్ డెవలప్మెంట్ అధికారి మురళి, అసిస్టెంట్ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు హాసిని, రామ తులసి, మండల విద్యాశాఖ అధికారులు మల్లేశ్వరరావు, తాతబ్బాయి దొర, పాల్గొన్నారు.

కలెక్టర్ ఆకస్మిక పర్యటన

తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం

ప్రజాశక్తి-దుంబ్రిగూడ:

మండలంలో అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా పర్యటించారు.ఈ సందర్భంగా ఉదయం 11 గంటల సమయంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో సందర్శించారు. ఆ సమయంలో సిబ్బంది ఎవరు అందుబాటులో లేక పోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత సిబ్బంది ఒక్కొక్కరు కార్యాలయంలో హాజరయ్యారు. సిబ్బందితో మాట్లాడిన తర్వాత స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సందర్శించి గిరిజనులకు అందుతున్న వైద్యంపై అక్కడి వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల గదిని పరిశీలించారు. ఇద్దరు వైద్యాధికారులు ఉండగా మరొక వైద్యాధికారి విధులకు ఎందుకు హాజరు కాలేదని కలెక్టర్ ప్రశ్నించారు. మరొక వైద్యాధికారిని ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా బిల్లాపుట్టు గ్రామంలో పాల్గొన్నారని చెప్పడంతో, వెంటనే అక్కడికి వెళ్లి విద్యాధికారిని హాజరయ్యారా లేదా అని పరిశీలించారు.

నిత్యం విధుల్లో సమయపాలన పాటించనీ ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ ఆకస్మిక పర్యటనతో గుండెల్లో దడ మొదలైంది. సమయపాలన పాటించనీ రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారనే దానిపై మండల వ్యాప్తంగా చర్చ జరుగుతుంది.

పిహెచ్‌సి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

శిశువుల మృతి

ప్రజాశక్తి -జి.మాడుగుల: మండలంలో వేరు వేరు గ్రామాల్లో ఇద్దరు శిశు మరణాలు చోటు చేసుకున్నాయి. బీరం పంచాయతీ వనలబ గ్రామానికి చెందిన సాగేని రవిబాబు, మనీ దంపతుల మూడు నెలల బాబు సోమవారం అనారోగ్యానికి గురి కావడంతో పాడేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యం పొందుతూ మృతి చెందాడు. గేమిలి పంచాయతీ కోనేటి గ్రామానికి చెందిన శోభ నాగేశ్వరరావు, కొండమ్మల మూడు నెలల బాబు అనారోగ్యానికి గురి కావడంతో పాడేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. మంగళవారం తెల్లవారు జామున శ్వాస సంబంధిత వ్యాధితో మరణించినట్టు తల్లిదండ్రులు తెలిపారు. చిన్నారుల మరణాలతో రెండు గ్రామాల్లో విషాదఛాయలు అమ్ముకున్నాయి. తల్లిదండ్రులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు.

విజేత జట్టుకు షీల్డ్ అందజేస్తున్న నిర్వాహకులు

క్రికెట్ టోర్నీ విజేత చింతూరు

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో చింతూరు మండల కేంద్రంలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా చింతూరు నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్ పోటీలో చింతూరు ఎఫ్‌వైఏసి, రామవరం జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన చింతూరు జట్టు నిర్ణీత 15 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 120 పరుగులు తీయగా అనంతరం రామవరం జట్టు 13 ఓవర్లలో 67 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అసిస్టెంట్ ఎంవిఐ జగదీష్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో తోడ్పడుతాయని తెలిపారు. క్రీడల ద్వారా యువతకు ఎంతో భవిష్యత్తు ఉంటుందన్నారు. యువత గ్రామస్థాయి నుంచి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం విన్నర్స్‌కు షీల్డ్‌తో పాటుగా నగదు బహుమతిని అందజేశారు. నెల రోజులపాటు సాగిన ఈ టోర్నమెంట్ 80 జట్లు పాల్గొనగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్‌గా గౌతమ్, బెస్ట్ ఆల్ రౌండర్‌గా రాము నిలిచారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రదీప్, దుర్గా, సూరి, అజయ్ రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ గర్జనపై ప్రచారం

ప్రజాశక్తి -అనంతగిరి:ఈనెల 30న అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో జరిగే ఆదివాసీ బహిరంగ గర్జన సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివాసి జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ ఎం. రాజా బాబు కోరారు. ములియాగూడ, డమ్ముకు, బొర్రా, అనంతగిరి, కొత్తవలస ప్రాంతాలలో ప్రచార యాత్ర నిర్వహించారు. సిపిఎం జెడ్పిటిసి గంగరాజు ప్రచారం లో పాల్గొన్నారు. ఆదివాసి గర్జన మహాసభ పోస్టర్‌ను మూడు రోడ్ల కూడలి వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జెడ్పిటిసి గంగరాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కొత్త జీవోలు తెచ్చి ప్రశాంతంగా బతుకుతున్న ఆదివాసి బిడ్డల్లో ఆందోళన సృష్టిస్తోందన్నారు. సామ్యూల్ ఆనంద్ ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసి బోయా, బెంతు, ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకుంకు ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తీసుకుందన్నారు.దీనిపై జిల్లా పరిషత్ పాలకవర్గ సమావేశాలలో ప్రస్తావిస్తాన్నారు.అలాగే ఆదివాసి ప్రతినిధి రాష్ట్ర నాయకులు రాజబాబు మాట్లాడుతూ, ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేరిస్తే ఊరుకోబోమని తెలిపారు.ఈనెల 30న పాడేరు లో జరిగే ఆదివాసి గర్జన సభకు ప్రజలు, ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాలు, గిరిజన ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి జెఏసి ప్రతినిధులు సన్యాసిరావు, గురుదొర పాల్గొన్నారు.

ప్రచారం చేపడుతున్న గంగరాజు, తదితరులు

భూ రీ సర్వే వేగవంతం

జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్

ప్రజాశక్తి -అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన భూ రీ సర్వేను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. మంగళవారం మండలంలో సందర్శించిన ఆయన గత రెండు నెలలుగా జరుగుతున్న రీ సర్వే పనితీరును మండల రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాశీపట్నం పంచాయతీ పరిధి పందిరిమామిడివలస, పల్లంవలస గ్రామాల్లో సందర్శించారు. రోజువారి సర్వే నిర్వహించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలియపరచాలన్నారు. సర్వేను మరింత వేగవంతం చేపట్టేందుకు అనేక చర్యలు చేపడుతున్నామని క్షేత్రస్థాయి రెవిన్యూ సర్వే బృందాలు అలసత్వం వహించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తాహశీల్దార్ రాంభాయి పాల్గొన్నారు..


పరిశీలిస్తున్న జెసి

పెదబయలులో భారీ వర్షం

ప్రజాశక్తి-పెదబయలు:మండలకేంద్రంలో మంగళవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో కుండపోత వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ కాసింది. గిరిజన రైతులు వరి కోతలు ప్రారంభించడంతో పన్నలు పూర్తిగా నీటిమట్టం అయ్యాయి. దీంతో, రైతులు దిక్కుతోచని స్థితిలో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే తమను ఆదుకోవాలని రైతులు కోరారు.

కురుస్తున్న వర్షం

గిరిజనులకు నష్టం చేకూర్చే చర్యలొద్దు

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు, చింతపల్లి మండలాల్లోని గానుగుల రావణాపల్లి, ఎర్రవరం గ్రామాల వద్ద నిర్మించ తలపెట్టిన హైడ్రో ప్రాజెక్టును అదాని కంపెనీకి అప్పగించడాన్ని గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎస్.సూరిబాబు తీవ్రంగా ఖండించారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం అదానికి ఇచ్చే నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు వల్ల రెండు మండలాల్లో 32 గ్రామాలు ప్రజలు భూములు, ఇళ్లు, స్థిరాస్తులు కోల్పోతారని, ఇది తెలిసి కూడా రాష్ట్ర ప్రభుత్వం బిజెపి ప్రభుత్వానికి తలవంచి క్యాబినెట్లో తీర్మానం చేయడం సరికాదని పేర్కొన్నారు. 1/70, పీసా చట్టాలను తుంగలో తొక్కి, గ్రామసభలు జరగకుండా గిరిజనులను నాశనం చేసే హైడ్రోపవర్ ప్రాజెక్టు అనుమతి ఇవ్వడం దుర్మార్గమన్నారు. తనకు మద్దతుగా నిలిచే గిరిజనుల జీవనాన్ని ముఖ్యమంత్రి జగన్ ప్రశ్నార్థకం చేస్తున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టు ఆపే విధంగా మేధావులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మొండి వ్యవహరిస్తే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు వై.అప్పలనాయుడు, గిరిజన సంఘం మండల నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సూరిబాబు

సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకు సేవలు

పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-సీలేరు

సచివాలయ, వాలంటీర్ వ్యవస్థల వల్ల అనేక సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి అన్నారు. జీకే.వీధి మండలం సీలేరులో వాటర్ ట్యాంకు, సచివాలయం, రైతు భరోసా కేంద్రాల భవనాలను ఆమె ప్రారంభించారు. ఇటీవల మృతి చెందిన జికె.వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ సర్పంచ్ కె.పరదేవి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ సీలేరు సర్పంచ్ కె.పరదేశి పార్టీలకు అతీతంగా ప్రజలకు గణనీయమైన సేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. ఆయన అకాల మృతి తీవ్ర మనోవేదన గురి చేసిందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు సంక్షేమ ఫలాలను వారి చెంతకు చేర్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపిటీసీ పిల్లా సాంబమూర్తి వైసీపీ అధ్యక్షులు కృష్ణమూర్తి సీలేరులో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మధ్యాహ్నం సీలేరు పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంపుకు చేరుకొని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం పథకాలు అందుతున్నాయని లబ్ధిదారులు చెప్పడంతో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీలేరు మారెమ్మ అమ్మవారి ఆలయాన్ని ఎమ్మెల్యే సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జీకే వీధి ఎంపిపి బోయిని కుమారి, జడ్పిటిసి కిముడు శివరత్నం, ఎంపిటీసీ పిల్ల సాంబమూర్తి, వైసిపి అధ్యక్షులు కృష్ణమూర్తి, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఇఓపిఆర్‌డి పాపారావు, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ రుక్మానందరావు, జెఇ భగవంతురావు, పంచాయతీరాజ్ ఏఈ కె.సత్తిబాబు, జెఇ జ్యోతి బాబు, జీకే వీధి సీఐ అశోక్ కుమార్, స్థానిక ఎస్సై రామకృష్ణ, సీలేరు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ వల్లి ప్రసాద్, సర్పంచి కుంజేటి రామకృష్ణ, వైసిపి నాయకులు బొబ్బిలి లక్ష్మణ్, వెంకట్రావు, చంద్రయ్య, స్వర్ణలత, తిరుపతి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.


రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం స్థానికులతో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-అడ్డతీగల

అడ్డతీగల-రంపచోడవరం ప్రధాన జాతీయ రహదారిలో టేకు ప్లాంటేషన్ వద్ద రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. అనపర్తి మండలం మాచవరం గ్రామానికి చెందిన పోకల వీర వెంకట సత్యనారాయణ, కొల్లి సూర్యనారాయణ, ఎం సురేష్, రాజవొమ్మంగి మండలం అనంతగిరి గ్రామానికి చెందిన వాసా సునీల్ వేటమామిడి గ్రామం నుండి అడ్డతీగల వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను 108 సహాయంతో అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేసి, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాఠశాలకు కొత్త భవనం నిర్మించాలని ధర్నా

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని లోదొడ్డి పంచాయతీ పరిధి పాకవెలితి గ్రామంలో శిథిలావస్థలో ఉన్న జిపిఎస్ పాఠశాలకు కొత్త భవనం నిర్మించాలంటూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆ గ్రామ గిరిజనులు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల నాయకులు మేలిన రమేష్, జర్తా రాజబాబు మాట్లాడుతూ పాక వెలితి గ్రామంలో ఉన్న గిరిజన ప్రాథమిక పాఠశాలలో 1 నుండి 3వ తరగతి వరకు సుమారు 20మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. పాఠశాల భవనం శిథిలావస్థలోకి చేరడంతో పెచ్చులూడి విద్యార్థుల మీద పడుతున్నాయని, వర్షం వస్తే పాఠశాల మొత్తం కారిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాఠశాల మరమ్మతులకు నాడు నేడు కింద రూ.26వేలు నిధులు ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిందని, ఆ డబ్బులు దేనికి సరిపోవని తెలిపారు. తక్షణమే పాఠశాలకు కొత్త భవనం నిర్మించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు పి సత్యనారాయణ, లోతా శ్రీను, ఎం శ్రీను, ఎం రాంబాబు, ఎం వినోద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న గిరిజనులు

ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశం నిషేధంపై వినతి

ప్రజాశక్తి-అరకులోయరూరల్:గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రజాసంఘాలు, పాత్రికేయుల ప్రవేశం కల్పించే విధంగా చూడాలని అరకులోయ ఏపీ టూరిజం హరిత హిల్స్‌లో హైకోర్టు అడ్వకేట్ శ్రావణ్ కుమార్‌కు ఆదివాసి సేన రాష్ట్ర నాయకులు మాజీ ఎంపీటీసీ, దురియ సాయిబాబు ఆధ్వర్యాన సేన నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు నాయకులు వివరాలను వివరించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మెను అమలు కాలేదని, మౌలిక సదుపాయాలు లేక గిరిజన విద్యార్థులు సమస్యలతో సతమతం అవుతున్నారని వివరించారు.గిరిజన ఆశ్రమ హాస్టల్స్ హెల్త్ వాలంటర్లు లేక చాలా మంది విద్యార్థులు అనారోగ్యంతో చనిపోతున్న పరిస్థితి నెలకొందన్నారు. ఐటిడిఎ అధికారులు పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సేన జిల్లా నాయకులు సవర చొక్కారావు, చుంచు రాజుబాబు, సతీష్ పాల్గొన్నారు.

సరుకులు, దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-అరకులోయరూరల్:మండలంలోని పద్మా పురం పంచాయతీ యండపల్లివలస గ్రామంలోని నిరుపేద గిరిజనులకు, వృద్ధులకు వస్త్రాలు, సబ్బులు, పేస్టులు హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ఏజెన్సీ మహిళా అధ్యక్షురాలు కె.కృష్ణకుమారి ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో అనేకమంది నిరుపేదలు ఉన్నారని గిరిజనులు ఇప్పటికీ నిరుపేదలుగా ఉన్నారని తెలిపారు. అటువంటి పేద వారికి ఎంతో కొంత సాయం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పందెం రాయుళ్లతో ఎస్ఐ

కోడి పందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి - పెదబయలు : మండలంలో సేకరి పంచాయతీ కొరపల్లి గ్రామ శివారులో కోడి పందేలపై సోమవారం రాత్రి ఎస్ఐ పి.మనోజ్ కుమార్ సిబ్బందితో కలిసి మెరుపు దాడి నిర్వహించారు. 9 పందెం కోడి పుంజులు, రూ. 8,450 నగదు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గం పరిధి బీలాల్ కాలనీ కొండవాలు ప్రాంతంలో ఇటీవల ప్రమాదవశాత్తు కమ్మల ఇల్లు దగ్ధమై యువతి సజీవదహనమైన బాధిత కుటుంబాన్ని జనసేన డాక్టర్ సెల్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బొడ్డేపల్లి రఘు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జరిగిన సంఘటన తమ పార్టీ శ్రేణులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. అగ్ని ప్రమాదంలో కుటుంబ సభ్యురాలని పోగొట్టుకుని ఇల్లు లేక రోడ్డున పడ్డ ఆ కుటుంబానికి బాసటగా నిలిచేందుకు నిర్ణయించుకున్నామని చెప్పారు. 10రోజుల్లో ఆ స్థలంలో కొత్త ఇంటిని నిర్మించి ఇస్తామని బొడ్డేపల్లి రఘు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కిరణ్ ప్రసాద్, యడ్లపల్లి కళ, ప్రియాంక బరాటం పాల్గొన్నారు.

మట్టి తొలగింపు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఇటీవల కురిసిన వర్షాలకు స్థానిక బీచ్ రోడ్డులో ఉన్న ఉమర్ అలీషా ఆశ్రమం వద్ద రోడ్డుపైకి వచ్చిన ఎర్రమట్టిని జివిఎంసి ఒకటో జోన్ అధికారులు మంగళవారం యంత్రాల సాయంతో తొలగించారు. రోడ్డుపైకి ఎర్ర మట్టి చేరడం వల్ల వాహనాలు, స్థానికుల రాక పోకలకు ఇబ్బంది ఎదురవుతున్న నేపథ్యంలో జోనల్ కమిషనర్ ఎస్.వెంకటరమణ ఆధ్వర్యాన మట్టి తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి మహాలక్ష్మినాయుడు, మూడో వార్డు వైసిపి నాయకులు జి.మధునాయుడు, ఎ సూర్య ప్రకాష్, జి.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

తహశీల్దార్ ఆత్మహత్యపై విచారణ చేపట్టాలి

గిరిజన సంఘం

తహసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:పెదబయలు తహసిల్దార్ ఆత్మహత్య పై సమగ్ర విచారణ జరిపి భాద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గిరిజన ఆధ్వర్యాన మంగళవారం అరకువేలి మండలం తాహాశీల్దార్ వేణుగోపాల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై సమాగ్ర విచారణ చేయకుండా గిరిజన ఉద్యోగుల సస్పెన్షన్ సరికాదని పేర్కొన్నారు. తహసిల్దార్ ఆత్మహత్య పై అనేక అనుమానాలు ఉన్నాయని, బాధిత కుటుంబానికి అన్ని రకాలుగా న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న, గిరిజన సంఘం నాయకులు కె.రామారావు, సుంకరమెట్ట సర్పంచ్ జి.చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు :తహశీల్దార్ ఆత్మహత్యపై ఉన్నత స్థాయి అధికారులు సమగ్రమైన విచారణ జరపకుండా గిరిజన ఉద్యోగులను సస్పెన్షన్ చేయడం సరికాదని గిరిజన సంఘం పూర్వ జిల్లా అధ్యక్షులు బొండా సన్నిబాబు, స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షులు స్తాంగుల జగత్రై, సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి కిల్లో సర్బన్న తెలిపారు. ఈ మేరకు తమశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బొండా గంగాధరం, గిరిజన మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కౌన్సిల్య పాల్గొన్నారు.

పెదబయలు

పాడేరు : పెదబయలు మండల తహసిల్దార్ ఆత్మహత్య ఘటనపై విచారణ చేయాలని పాడేరు తహసీల్దార్ వి త్రినాధరావుకు ఏపీ గిరిజన సంఘం గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పాలికి లక్కు, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి కూడ రాధాకృష్ణ మాట్లాడుతూ: ఆదివాసి ప్రాంతంలో పని చేస్తున్న ఉద్యోగుల పట్ల అధికారులు వేధింపులు మానుకోవాలన్నారు. ఆదివాసి ప్రాంతంలో పని చేస్తున్న ఉద్యోగులకు రక్షణ కల్పించాలని, పెదబయలు మండల తహసీల్దార్ ఆత్మహత్యపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించాలన్నారు.ఐటీడీ ఏపీఓను రక్షించడం కోసం గిరిజన ఉద్యోగులను బలి చేయడం సరైనది కాదని తక్షణమే సస్పెన్షన్ ఎత్తివేయాలని, లేనిపక్షంలో ఆదివాసి ప్రాంతంలో ఉద్యమ ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట:పెదబయలు తహసీల్దార్ శ్రీనివాసరావు మృతి పై సమగ్ర విచారణ చేపట్టాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి కిల్లో రామారావు డిమాండ్ చేశారు.గిరిజన సంఘం ఆధ్వర్యంలో హుకుంపేట మండల తహసీల్దార్ కార్యక్రమం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన ఉద్యోగులపై వేదింపులు అరికట్టాలని, డిటి, సీనియర్ అసిస్టెంట్ పై విధించిన సస్పెండ్ రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ ఆత్మహత్యపై సమగ్రమైన విచారణ నిర్వహించకుండానే అమాయకమైన గిరిజన ఉద్యోగులను సస్పెండ్ చేయడం సరైనది కాదన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మణరావు, గిరిజన మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు సొంటేన హైమావతి, గిరిజన సంఘం నాయకులు బాకూరు దేవి రాజు, వార్డ్ మెంబర్ పాంగి మల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై చొరవ చూపండి

జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

వీడియో కాన్ఫరెన్సలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు:స్పందన సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధాన కార్యదర్శిలు నిరంతరం సమీక్షలు జరుపుతున్నందున ఈ సమస్యల పరిష్కారంలో తహసిల్దార్లు, ఎంపిడిఓలు చొరవ తీసు కోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి జిల్లాలోని తహసిల్దార్లు, ఎంపిడిఓలు, ఐటిడిఎ అధికారులు, గృహ నిర్మాణ, పంచాయతి, మెడికల్ అండ్ హెల్త్, ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్పందన ఫిర్యాదులను రిజిస్టర్ లో నమోదు చేసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు విధంగా పరిష్కరించాలని, అందుకు సంబందించిన ఫోటోలను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. విఆర్ఓలు సచివాలయాలలో హాజరు కావాలని, బయటకి వెళ్తే వెళ్ళే సమయం, తిరిగి వచ్చే సమయం మూవ్మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. రీ సర్వే పక్కాగా నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా గ్రామ శివార్లలో బోర్డర్లు పక్కాగా గుర్తించాలన్నారు. మ్యుటేషన్లు, ఇతర ధ్రువపత్రాల జారీలో తాత్సారం లేకుండా సకాలంలో జారీ చేయాలని పేర్కొన్నారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ మెరుగుపడాలని కలెక్టర్ ఆదేశించారు. ఐటిడిఎ, మండల పరిషత్ అధికారులు పారిశుధ్య నిర్వహణ ప్రధమ కర్తవ్యంగా భావించాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 13 కోట్లు మంజూరయ్యాయని, అందులో 50 శాతం పారిశుధ్య నిర్వహణకు ఖర్చు చేయవచ్చని తెలిపారు. ప్రతి పంచాయతి నుండి రెండు వేలు ఎంపిడిఓకు బదలాయిస్తే మండలానికి రెండు ట్రాక్టర్లు అద్దెకు, ప్రతి పంచాయతీలో అదనపు పారిశుధ్య సిబ్బందిని కేటాయించి నిర్వహణ చేపట్టాలన్నారు. గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని, కొత్తగా ఒక వెయ్యి వరకు రిజిస్ట్రేషన్, మరో 2,500 వరకు జియో టేగింగ్ పెండింగ్ ఉన్నందున త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రంపచోడవరం, చింతూరు డివిజన్లలో ఆశించిన స్థాయిలో గృహ నిర్మాణాలు లేవని, ఆయా డివిజన్లలో ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారులు తప్పనిసరిగా నెలలో ఐదు ఆశ్రమ పాఠశాలలు, జిల్లా పరిషత్ పాటశాలలు సందర్శించి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. మండల విద్యాశాఖాధికారులు, ఎండిఓలు, ఎటిడబ్ల్యుఓలు కుడా తప్పనిసరిగా తనిఖీలు చేపట్టలన్నారు. ఈ వీడియొ కాన్ఫరెన్సులో జిల్లా నుండి శిక్షణ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా, జిల్లా పంచాయతి అధికారి కొండలరావు, గృహ నిర్మాణ శాఖ పిడి శ్రీనివాసరావు, ఎడి మోహనరావు, పంచాయతి రాజ్ ఇఇ లావన్యకుమార్ పాల్గొన్నారు.

వికలాంగుల క్రికెట్ పోటీల్లో కర్ణాటక గెలుపు

ప్రజాశక్తి -పిఎం పాలెం : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం క్రికెట్ మైదానంలో తానా ఆధ్వర్యాన ఈ నెల 9వ తేదీ నుంచి జరుగుతున్న వికలాంగుల దక్షిణభారత క్రికెట్ కప్ 2022 పోటీలు మంగళవారంతో ముగిసాయి. కర్నాటక జట్టు విజేతగా నిలిచింది. దక్షిణాది రాష్ట్రాల నుంచి ఆంధ్ర, కేరళ, తెలంగాణా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన జట్లు పాల్గొనగా మంగళవారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో కర్ణాటక, తమిళనాడు జట్లు తలపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన తమిళనాడు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టపోయి 127 పరుగులు చేయగా, కర్ణాటక జట్టు 12.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి విజయాన్ని అందుకుంది. అనంతరం వికలాంగులకు ట్రై సైకిళ్లు, వృద్ధులకు రగ్గులు పంపిణీచేశారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విజేతలను గీతం అధ్యక్షుడు ఎమ్. శ్రీభరత్, తానా ఫౌండేషన్ అధ్యక్షుడు లావు ఆంజనేయ చౌదరి, చైర్మన్ యార్లగడ్డ వెంకటరమణ, ట్రస్టీ రవిసామినేని, క్రీడా విభాగం కో-ఆర్డినేటర్ శశాంక్ యార్లగడ్డ, ఆంధ్రప్రదేశ్ వీల్‌చైర్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎమ్.శామ్యూల్ బెంజిమన్, కార్యదర్శి రామన్ సుబ్బారావు, పోటీల నిర్వహక కార్యదర్శి రక్మాకరరావు, గీతం క్రీడా విభాగం డైరక్టర్ కె.అరుణా కార్తిక్ తదితరులు అభినందించారు.

సెలవులు అమలు చేయాల్సిందే : సీతారాం

ప్రజాశక్తి-సిరిపురం : అన్ని ప్రభుత్వ, ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రతి ఆదివారమూ, నెలలో రెండో శనివారం సెలవులను తప్పకుండా అమలుచేయాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం స్పష్టంచేశారు. సెలవులు అమలులో ఆయా విద్యా సంస్థలు చేపడుతున్న చర్యలపై సీతారాం ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐఒ ఆర్.సత్యనారాయణ, జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ, చైల్డ్ లైన్ జిల్లా కో-ఆర్డినేటర్ డేవిడ్ రాజు, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో మంగళవారం సిరిపురం జంక్షన్‌లోని నారాయణ కళాశాలలను సందర్శించారు. విద్యార్థులు, కళాశాల ప్రతినిధులతో భేటీ అయ్యారు. సెలవులు ఎంతవరకు అమలు చేస్తున్నది అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో జి.శ్రీదేవి, పి.వెంకటకుమారి, పి.శేఖర్, కె.ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి : అక్కరమాని

ప్రజాశక్తి - ఆరిలోవ : పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్తా సైనికుని వలే కృషిచేయాలని వైసిపి తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల పిలుపునిచ్చారు. జివిఎంసి 9, 12, 13 వార్డుల కార్పొరేటర్లు కోరుకొండ స్వాతీదాస్, అక్కరమాని రోహిణి, కెల్ల సునీత, 10వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి జగ్గుపిల్ల అప్పలరాజు ఆధ్వర్యాన మంగళవారం కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని కోరారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి సచివాలయానికీ ముగ్గురు కన్వీనర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. వీరితో పాటు గృహ సారధులను కూడా నియమిస్తున్నట్టు చెప్పారు. వీరందరూ సమన్వయం చేసుకొని ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరేవిధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అక్కరమాని వెంకటరావు, ఆయా వార్డుల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి : ముత్తంశెట్టి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో ఉన్న పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. రాజకీయ ప్రత్యర్థులు ఎన్ని కుట్రలు, కుయుక్తులకు పాల్పడినా సరే 2024 ఎన్నికల్లో వైసిపి విజయం తథ్యమని స్పష్టం చేశారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి సమాంతరంగా జరుతుందన్నారు. మాజీ మంత్రి బాలరాజు మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, మాజీ కౌన్సిలర్లు కొప్పల రమేష్, ఎం.లక్ష్మణరావు, జివి.రమణ, జగుపిళ్ల ప్రసాద్, కె.ఎల్లాజీ, వైసిపి నాయకులు ఎస్.కరుణాకరరెడ్డి, ఎం.షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో జాతీయ భాషా దినోత్సవం

ప్రజాశక్తి- పిఎం.పాలెం : ప్రముఖ తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న భారతీయ భాషా దినోత్సవ కార్యక్రమం ముగింపును కొమ్మాది నవోదయ విద్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, భాష, సంస్కృతి పట్ల అవగాహనను కలిగించే ఉపన్యాసాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దళారులను నమ్మి మోసపోవద్దు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని వ్యవసాయ అధికారి రమేష్ నాయుడు అన్నారు. మండలంలోని ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు ద్వారా 237.8 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. 17 శాతం లోపు తేమ వచ్చేవరకు రైతులు ధాన్యాన్ని ఆరనివ్వాలని సూచించారు, రైతులు ధాన్యం విక్రయించేందుకు సంసిద్ధంగా ఉన్నప్పుడు తమ సచివాలయ పరిధిలో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. ఇప్పటికే చాలామంది రైతులకు సంచులను అందజేయడం జరిగిందని చెప్పారు.

భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న లక్ష్మి, తదితరులు

భవన నిర్మాణం సత్వరం పూర్తి చేయాలి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండల కేంద్రంలోని రేఖపల్లి కస్తూరిబా గాంధీ విద్యాలయంలో నాడు నేడు పథకం కింద భవన నిర్మాణాలను సత్వరమే పూర్తి చేయాలని ఎంపీపీ కారం లక్ష్మి, రేఖపల్లి సర్పంచ్ పూనం సరోజిని అన్నారు. మంగళవారం కెజిబివిలో నాడు-నేడు కింద చేపట్టిన భవన నిర్మాణాల పనితీరును సిపిఎం నాయకులతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు నేడు గ్రాంట్ ద్వారా రూ.48 లక్షలతో బిల్డింగ్ మంజూరైతే ఇప్పటికి పునాదుల వరకే నిర్మాణం చేయడం ఏమిటని ప్రశ్నించారు. భవన నిర్మాణాలు సకాలంలో పూర్తికాక విద్యార్థులు ఇరుకు గదుల్లో చదువుకోవాల్సిన దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, నాయకులు ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఒత్తిడితోనే సచివాలయ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రజలపై వేసే అనధికార పన్నులు వసూలు చేయలేక సచివాలయం ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, వీటికి కారణం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆరోపించారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయం వద్ద సచివాలయ సిబ్బంది ధర్నా చేయాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. వీరందరినీ ఉద్యోగాల్లో నియమించింది ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని గుర్తు చేశారు. టిడ్కో ఇళ్లు ఇప్పటికీ పూర్తి చేయడం లేదని, అర్హులను తొలగించి వైసిపి నేతలకు ఇళ్లు కేటాయించుకుంటున్నారని ఆరోపించారు. పేదవాడి గృహాల మీద రాజకీయం చేస్తున్నారని, ఆ ఇళ్లను వైసిపి నేతలు వెనుకుండి అమ్ముకుంటున్నారని అన్నారు. దమ్ముంటే గృహాల కేటాయింపు మీద విచారణ జరిపించాలని సవాలు విసిరారు. గతంలోని జివిఎంసి కమిషనర్లు అధికార పార్టీ వారి దోపిడీ కోసం చేయని పనులన్నీ ప్రస్తుత కమిషనర్ రాజబాబు చేస్తున్నారని ఆరోపించారు.

ఉపాధి బిల్లులు, తునికాకు బోనస్‌లు చెల్లించాలి

సిపిఎం మండల కార్యదర్శి చిన్నబాబు

ప్రజాశక్తి- విఆర్.పురం

మండలంలోని చిన్నమట్టపల్లి పంచాయతీ పరిధి సున్నంమట్కా గ్రామంలో ఉపాధి హామీ పనులు చేసిన ఆదివాసీలకు పెండింగ్ బిల్లులు, తునికాకు కార్మికుల బోనస్‌లు తక్షణమే చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సున్నం మట్కా గ్రామంలో లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో చిన్నబాబు మాట్లాడుతూ ఉపాధి హామీ పనికి సంబంధించి ఏడు వారాలు పని దినాలకు ఇంతవరకు పేమెంట్ చెల్లించలేదని తెలిపారు. 2013 నుండి తునికాకు కార్మికులకు బోనస్ ఇవ్వలేదన్నారు. సున్నం మట్కా గ్రామానికి తాగునీరు, రహదారి, కరెంట్ వంటి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులపై ఫారెస్ట్ అధికారులు వేధింపులు ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మడకం రమేష్, సోడి జోగయ్య, లక్ష్మయ్య, వంజం, మహిత భీమయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చిన్నబాబు

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌ను నూటికి నూరు శాతం ప్రయివేటీకరణ చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లూ చేస్తోందని, ఈ చర్యలను కార్మికులు, ప్రజలతో కలిసి అడ్డుకుంటామని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు మంగళవారానికి 621వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐఎఫ్‌టియు కార్యకర్తలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం 22 వేల ఎకరాల భూములను రైతులు త్యాగం చేశారన్నారు. అయితే ఈ భూములలో అధిక భాగం నేటికీ స్టీల్‌ప్లాంట్ ఉపయోగంలో లేవన్నారు. ఒప్పందం ప్రకారం భూములు ఇచ్చిన రైతుల కుటుంబాల్లో వారికి స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ నేటికీ సుమారు 8500 మందికి ఉపాధి కల్పించలేదన్నారు.

50 ఏళ్లు గడిచినప్పటికీ ఉపాధి కల్పించలేదంటే ఇంతకంటే అన్యాయం మరొకటి ఉండదన్నారు. ఈ నేపథ్యంలో మిగులు భూములను నిర్వాసితులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన గనులను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు వై.కొండయ్య, ప్రధాన కార్యదర్శి కె.మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎటిఎం చోరీల కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో శ్రీ కనకమహాలక్ష్మి కో -ఆపరేటివ్ బ్యాంక్ ఎటిఎంలలో ఉన్న సాంకేతిక లోపం ఆధారంగా ఎటిఎం చోరీలకు పాల్పడుతున్న ముఠాలోని ముగ్గురిని నగర పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ ఆ కేసుల వివరాలను వెల్లడించారు. నగరంలోని శ్రీ కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.శ్యామ్ కిషోర్ తమ ఎటిఎం మిషన్లలో పెట్టిన నగదు కన్నా విత్ డ్రా చేసిన నగదు ఎక్కువుగా ఉంటుందని, దీనిపై ప్రాథమికంగా విచారించి అనధికారికంగా రూ.9,49,500 విత్ డ్రా అయ్యాయని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు రాజస్థాన్‌కు చెందిన సైకుల్, రషీద్, మస్సీమ్‌లను అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు షారుక్ పరారీలో ఉన్నాడు.

చోరీలు ఇలా..

ప్రధాన నిందితుడు షారుక్ 2017 నుంచి వివిధ వ్యాపారాల నిమిత్తం విశాఖ వస్తూ, పోతూ ఉండేవాడు. ఈ క్రమంలో కనక మహాలక్ష్మి బ్యాంకు ఎటిఎంలో ఉన్న సాంకేతిక లోపాన్ని గుర్తించాడు. దీంతో పక్కా ప్రణాళిక రచించి రాజస్థాన్‌లోని తమ గ్రామంలోని ప్రజలతో వివిధ బ్యాంకులలో అకౌంట్లు ఓపెన్ చేసి వారి వద్ద నుంచి 78 ఎటిఎం కార్డులను తీసుకున్నాడు. అతని బంధువులు ముగ్గురుతో కలిసి నవంబర్ 30న నగరానికి వచ్చాడు. అనంతరం ఆ నలుగురు వివిధ హోటళ్లలో బస చేస్తూ 26 ఎటిఎం కార్డులు ఉపయోగించి 95 లావాదేవీల ద్వారా నగరంలోని కంచరపాలెం, మురళీనగర్, గాజువాక, అనకాపల్లిలలో ఉన్న నాలుగు ఎటిఎంల్లో రూ.9,49,500ను విత్ డ్రా చేశారు. అందులో ఈ నెల 2, 3 తేదీలలో 53 ట్రాన్సాక్షన్స్ ద్వారా రూ.5,29,500, 4 ,5 తేదీలలో 42 లావాదేవీల ద్వారా రూ.4,20,000 విత్‌డ్రా చేశారు. బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు నిర్వహించి ముగ్గురు నిందితులను సోమవారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు.

సాంకేతిక లోపం ఇలా..

శ్రీ కనకమహాలక్ష్మి బ్యాంకు ఎటిఎంలోని లోపాన్ని సిపి వివరిస్తూ.. ఎటిఎం యంత్రం వెనక ఒక పవర్ బటన్ ఉంటుందని, ఖాతాదారులు నగదు విత్ డ్రా చేసే సమయంలో పిన్ నెంబర్ ఎంటర్ చేసిన తర్వాత ఆ పవర్ బటన్ ఆపేస్తే ఎటిఎం మిషన్ నుంచి డబ్బులు బయటికి వస్తాయని, కానీ అకౌంట్ నుంచి ఆ డబ్బులు కట్ అవ్వవని తెలిపారు. ఈ విషయాన్ని గ్రహించిన నిందితులు చాకచక్యంగా దొంగతనాలకు పాల్పడ్డారని ఆయన వివరించారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన వెస్ట్ జోన్ ఎసిపి ఎ.నరసింహమూర్తి, అతని బృందాన్ని కమిషనర్ అభినందించారు

స్వచ్ఛత అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న సిఆర్‌పిఎఫ్ సిబ్బంది

సిఆర్‌పిఎఫ్ ఆధ్వర్యాన శ్రమదానం

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని ఏడుగురాళ్లపల్లి అవుట్ పోస్ట్ సిఆర్పిఎఫ్ డి141 బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్ ధర్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ (ఓసి) పసుపులేటి కాశయ్య ఆధ్వర్యా స్వచ్ఛత భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఏడుగురాళ్లపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాల, బస్టాండు, గ్రామ పరిసరాలలో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా కాశయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంవత్సరానికి 100 గంటలు, వారానికి 2 గంటలు శ్రమదానం చేయాలని, అలా చేస్తే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడుగురాళ్లపల్లి డాక్టర్ శ్రీచైతన్య, చింతూరు సిఐ అప్పలనాయుడు, ఎస్సై యాదగిరి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

గోపిని సత్కరిస్తున్న అధికారులు

అటవీ శాఖాధికారికి సత్కారం

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు అటవీ రేంజ్‌లో పనిచేసిన డిఆర్ఓ గోపి రేంజ్ అధికారిగా ఉద్యోగోన్నతి పొంది విశాఖపట్నం జూ పార్క్‌కి బదిలీపై వెళ్తున్న సందర్భంగా మంగళవారం వీడ్కోలు కార్యక్రమాన్ని సీలేరు అటవీశాఖ టింబర్ డిపోలో ఏర్పాటు చేశారు. గోపి దంపతులను దుస్సాలువాలతో జీకే వీధి సిఐ అశోక్ కుమార్, స్థానిక రామకృష్ణ సత్కరించారు. ఏపీ జెన్కో ఈఈ లక్ష్మీనారాయణ జాకీర్ హుస్సేన్ ఏడిఈ అప్పలనాయుడు, ఏఈ సురేష్ ఘనంగా వీడ్కోలు పలికారు. పలువురు సాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీలేరు అటవీశాఖ రేంజ్ అధికారి శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్ సిహెచ్.సత్తిబాబు, డిఆర్ఓ సింహాచలం, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వినికిడి యంత్రాల పంపిణీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దీన్ దయాల్ శ్రవణ ఫౌండేషన్ సేవలు మిజోరం, ఒడిశా ప్రాంతాలకు విస్తరించాలని మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. దీన్ దయాల్ శ్రవణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినికిడి లోపం ఉన్న నిరుపేదలు 200 మందికి ఉచితంగా మంగళవారం వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి హరిబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు రేగుల రామాంజనేయులు చేస్తున్న సేవలు హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్, తదితరులు పాల్గొన్నారు.